



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 355 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 25 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :355 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 25 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు.. ట్రంప్ సంచలన నిర్ణయం



- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమలు
- కెనడా వల్లే తమకు వాణిజ్య లోటు వస్తోందన్న ట్రంప్
- అమెరికా నిర్ణయంపై ప్రతీకార చర్యలకు కెనడా సిద్ధం

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా, కెనడా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. కెనడా నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులు, వాహన విడిభాగాలు, ఉక్కుపై ఏకంగా 50 శాతం మేర సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు

- మిగతా 2లో

## ఉద్యోగాలు భర్తీ చేయకుండా రిజర్వేషన్లకు ఎసరు



- రిజర్వేషన్లను కేంద్రం పరోక్షంగా నిర్వీర్యం చేస్తోందన్న ఖర్గే
- లక్షల కొద్దీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ఆరోపణ
- రాజ్యాంగ సవరణ లేకుండానే రిజర్వేషన్లు ఎత్తేస్తున్నారని విమర్శ
- వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు వెల్లడి
- శాశ్వత ఉద్యోగాలు తగ్గించి కాంట్రాక్టు విధానం పెంచుతున్నారని ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా, లక్షలాది పోస్టులను ఖాళీగా ఉంచడం ద్వారా రిజర్వేషన్లను పరోక్షంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

- మిగతా 2లో



## ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్..


- ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ
- సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ అర్హత సాధించేందుకు అవకాశం
- ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- అక్టోబర్ 11 నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు
- ఈ అర్హత ప్రత్యక్ష నియామకాలకు వర్తించదని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఈ పరీక్షలు అక్టోబర్ 11 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొంటూ 'ఎక్స్'వేదికగా పోస్టు పెట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యాజమాన్యం (ప్రభుత్వ /

- మిగతా 2లో

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

- దేశీయ పాప్‌కార్న్ విత్తనాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, సీఎం
- ఫుడ్ ప్రాసెసింగ్‌తో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు
- ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీలను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు భారీ ప్రణాళిక
- నదుల అనుసంధానంతో నీటి భద్రత సాధిస్తామన్న చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియతో ఉత్పత్తుల విలువ పెరిగి, రైతులకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన 'గార్మే పాప్ కార్నికా' నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "రైతులపై ఉన్న ప్రేమతో ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాకు వచ్చి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్మే పాప్ కార్న్ సంస్థ మన దేశీయ నేలపైనే రైతులతో కలిసి నాన్-జీఎంఓ విత్తనాలను ఉత్పత్తి చేయడం అభినందనీయం. నూజివీడు గడ్డపై పండిన

- మిగతా 2లో

## రామోజీపై విమర్శలా? ముందు పోలవరం సంగతి చెప్పు!

### అంబటికి మంత్రి నిమ్మల కౌంటర్



- రామోజీరావును విమర్శించడం ఆకాశంపై ఉమ్మేయడమేనన్న మంత్రి నిమ్మల
- నైతికత లేని అంబటి రాంబాబు ఆ అర్హత కోల్పోయారని ఘాటు వ్యాఖ్యలు
- మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసిన మంత్రి
- పోలవరం వైఫల్యంపై అంబటి సమాధానం చెప్పాలని డిమాండ్
- రామోజీ స్థాయికి, వైసీపీ నేతల స్థాయికి నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా అని ఫైర్

- మిగతా 2లో

## ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. టెక్నాలజీతోనే సేవలు



- టెక్నాలజీతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరం
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు డేటా ఇంటిగ్రేషన్ విధానం
- ఎల్‌నినో ప్రభావం.. పంటల దిగుబడిపై సమీక్ష
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- శాఖల్లో సమర్థత, సేవల నాణ్యత పెంచాలని సీఎం ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందాలని, ఇందుకోసం ఏఐ అసిస్టెంట్, బ్లాక్ చెయిన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని విధంగా పాలన ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం పదేపదే వాటిని అప్‌లోడ్ చేసే పనిలేకుండా 'డేటా ఇంటిగ్రేషన్'

- మిగతా 2లో



## మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు

### కాకినాడ ఎస్పీ

**పెన్ పవర్ డెస్క్:** ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్

- మిగతా 2లో

## మాట తప్పారంటూ కేంద్రంపై సీజేపీ ఆగ్రహం.. సెప్టెంబర్ 5న భారీ నిరసన

- సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిరసన చేపట్టనున్న సీజేపీ
- ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చలేదని ఆరోపణ
- నీట్ మృతుల కుటుంబాలు, విద్యార్థులతో కలిసి ఆందోళన
- ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రకటన
- జూలై 25న ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరోసారి ఆందోళన బాట పట్టాలని నిర్ణయించింది. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నీట్ పరీక్షల

- మిగతా 2లో

## రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు



- బీజేపీని కనుమరుగు చేసే వరకు విశ్రమించనని శపథం
- జనగణన పేరుతో ఎన్ఆర్సీ అమలుకు కుట్ర అని ఆరోపణ
- అన్నపూర్ణ భండార్ పథకంపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- ఓటర్ల తొలగింపుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి

- మిగతా 2లో

## విజయ్ నిర్ణయం.. ఇతర రాష్ట్రాలకు జాక్‌పాట్

**పెన్ పవర్ డెస్క్:** తమిళనాడులోని పరందూర్‌లో కొత్తగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టును ముఖ్యమంత్రి విజయ్ పక్కనపెట్టడాన్ని డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ఖండించారు. ఆ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేస్తూ.. సంకుచిత రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టలేమని ధ్వజమెత్తారు. డీఎంకే హయాంలో రూపొందించిన ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను తిరస్కరించడాన్ని.. రాష్ట్ర అభివృద్ధికి కోలుకోలేని ఎదురుదెబ్బగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయం..



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నెగ్గాలంటే తగ్గాల్సిందే!

ఆంధ్రప్రదేశ్ లో జనసేన కొన్ని నియోజకవర్గాలకే పరిమితమయింది. అలాగే కొన్ని ప్రాంతాలలోనే దాని బలం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన బలం కొంత తగ్గింది కానీ.. పెంచుకునే ప్రయత్నం ఇప్పటి వరకూ ఆ పార్టీ నాయకత్వం చేయకపోవడం కూడా ఇందుకు కారణం కావచ్చు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికులను నిరుత్సాహ పర్చబోమని, 2024 నాటి ఎన్నికల పొత్తులకు, ఇప్పటికీ చాలా తేడా ఉందని పవన్ కల్యాణ్ చెప్పినా పెద్దగా పసలేనిదిగానే చూడాలి. ఎందుకంటే ఆయన వ్యాఖ్యల్లోనే ఒక లింకు కనపడుతుంది. అదేంటంటే బలం ఉన్న చోట పోటీ చేయడానికి వెనకాడబోం అని చేసిన ప్రకటనలో చాలా అంతరార్థం ఉంది. ఎందుకంటే జనసేనకు రాష్ట్రమంతా బలం లేదని అందరికీ తెలుసు. ఆ పార్టీ నాయకత్వానికి కూడా తెలుసు.

**కమిటీలు ఏర్పాటు చేసినా...**

ఇప్పటికిప్పుడు కమిటీలను ఏర్పాటు చేసినా ఆ నియామకాల్లో నుంచి కూడా అసంతృప్తి తలెత్తే అవకాశాలున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి తమ పార్టీపై కూడా బాగానే ఉందని మాత్రం ఆ పార్టీ నేతలకు అర్థమవుతుంది. పట్టుబట్టి కోరి అధికంగా సీట్లు తీసుకుని ఓడిపోయి చేతులెత్తేసేకన్నా.. తక్కువ స్థానాల్లో పోటీ చేయడం ఉత్తమన్న అభిప్రాయం కూడా ఎక్కువ మంది జనసేన నేతల్లో ఉంది. కానీ జనసేన క్యాడర్ లో మాత్రం ఎక్కువ స్థానాలు కావాలని పట్టుబడుతున్నారు. వారి వాదనను కాదనలేక, ఇప్పుడే అదేంలేదని చెప్పలేక అలా ఊరిస్తున్నారు తప్పించి పవన్ కల్యాణ్ కూడా స్థాయికి మించి స్థానాలను కోరే సాహసం చేయకపోవచ్చన్నది వాస్తవం. ఎందుకంటే పవన్ కల్యాణ్ ఇమేజ్ పైన కూడా స్థానిక సంస్థల ఫలితాలు ఆధారపడుతుంటాయి. అందుకే పవన్ వ్యాఖ్యలలో అనేక అర్థాలను అందరూ వెతుక్కుంటున్నారు.

**జనసేనను నిలబెట్టింది...**

2024 నాటికి, ఇప్పటికీ జనసేన తన బలం ఎంతో అంచనా వేయగలిగే పరిస్థితుల్లో లేదు. జనసేనను నిలిపింది మాత్రం పవన్ కల్యాణ్ పట్టుదల మాత్రమే. ఆయన చరిష్మా. సామాజికవర్గం అండ కూడా గత ఎన్నికల్లో పనిచేసింది. ప్రస్తుతం జనసేన మొండిగా పోయే పరిస్థితి కూడా కనిపించడం లేదు. జనసేనకు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొన్ని నియోజకవర్గాల్లోనే బలంగా ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లో మాత్రం నేటికీ బలహీనంగా ఉంది. అలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు వద్ద పట్టుబట్టి ఎక్కువ స్థానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో తీసుకోక పోవచ్చు. కాకుంటే కొన్ని ఎక్కువ స్థానాలు ఇవ్వాలన్న ప్రతిపాదన పెట్టి అందులోనూ మినహాయింపులు అడిగే అవకాశాలున్నాయి. పవన్కు ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత కావడంతో పవన్ కల్యాణ్ మొండిపట్టు పట్టి కూర్చునే రకం కాదని ఆయనను దగ్గర నుంచి చూసిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది. అదే చంద్రబాబు అది పెద్ద ధీమా.

# విజయ్ నిర్ణయం.. ఇతర రాష్ట్రాలకు జాక్‌పాట్

- మొదటి పేజి తరువాయి

పోటీ రాష్ట్రాలకు జాక్‌పాట్ లాంటిదేనని వ్యాఖ్యానించారు. "పరందూర్ విమానాశ్రయం విషయంలో దూరదృష్టి, ప్రణాళిక, సంప్రదింపులు లేకుండా తీసుకున్న నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిని కొన్నేళ్లు వెనక్కి నెట్టేస్తుంది. యువత ఉపాధి కలలను దెబ్బతీస్తుంది. అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఆందోళనకరం. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల నుంచి ఆటోమొబైల్స్ వరకు అన్ని రంగాల్లో ముందున్న తమిళనాడుకు ఈ విమానాశ్రయం ఎంతో అవసరం. అన్ని ప్రత్యామ్నాయాలను విశ్లేషించిన అనంతరమే పరందూర్ ప్రాంతాన్ని ఎంపిక చేశాం. మరోసారి అధికారంలోకి వచ్చాక పనులను వేగవంతం చేయాలని ప్రణాళికలు రూపొందించాం. ఇప్పుడు కొత్త ప్రభుత్వం మళ్లీ మొదటినుంచి ఈ ప్రక్రియ ప్రారంభిస్తే.. రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది' అని స్టాలిన్ విమర్శించారు.

**గ్రాము బంగారు ఉంగరం తయారీ ఖర్చు 'పైసా'**

పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నట్లు అంతకుముందు సీఎం విజయ్ (ఎఅయిఎం) అసెంబ్లీలో ప్రకటించారు. అభివృద్ధికి తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని పేర్కొంటూ.. ఈ ఎయిర్‌పోర్టు కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. "ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో దాదాపు 55 శాతం జలాశయాలు, చిత్తడి నేలలతో నిండి ఉంది. దీనివల్ల రన్‌వే కార్యకలాపాలపై ప్రభావం పడుతుంది. పైగా వరదల ప్రమాదం పొంచి ఉంది. ప్రజావ్యతిరేకత లేని చోట, నిపుణుల ఆధ్వర్యంలో సమగ్ర అధ్యయనాల అనంతరం కొత్త స్థలాన్ని ఖరారు చేస్తాం" అని చెప్పారు.

## ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్..

- మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల /APREIS/ప్రభుత్వ సంక్షేమ సంఘాల రెసిడెన్షియల్/ AP మోడల్ పాఠశాలలు / ప్రైవేట్ ఎయిడెడ్ / ఇతర ప్రభుత్వ) పాఠశాల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారితంగా జరిగే ఈ టెట్ పరీక్షలు రెండు సెషన్లలో జరగనున్నాయి. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్; మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్ పరీక్ష నిర్వహిస్తారు. అక్టోబర్ 5 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ కోసం అందుబాటులో ఉంచుతారు. అక్టోబర్ 24న ప్రాథమిక కీ విడుదల చేసి నవంబర్ 15న ఫలితాలను ప్రకటిస్తారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్లు 8121947387, 7995649286, 6281704160కు కాల్ చేయొచ్చని టెట్ కన్వీనర్ ఎ.వెంకట కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

ఈ పాప్‌కార్న్ దేశవిదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణం" అని అన్నారు. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, దేశీయ పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉండటంపై గార్మె సంస్థను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ వంటి దేశాలపై ఆధారపడ్డామని, ఇకపై ఆ సంపద మన దేశంలోనే ఉంటుందని తెలిపారు.

**గ్లోబల్ బ్రాండ్లుగా మన ఉత్పత్తులు**

"ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో వంటివి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రాండ్లుగా మారాలి. రైల్వే స్టేషన్లలోనూ వీటి కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. కొండపల్లి కొయ్యబొమ్మల వంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరాలి. కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామికవేత్తలుగా చూస్తున్నాయి. పసుపు, మిరప, ఆక్వా ఉత్పత్తులకు విలువ జోడించి ఎగుమతి చేయడమే మా లక్ష్యం" అని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 10 శాతం ఉత్పత్తులు మాత్రమే ప్రాసెస్ అవుతున్నాయని, ఈ శాతాన్ని పెంచడం ద్వారా అధిక సంపదను ఆర్జించవచ్చని అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, ముఖ్యంగా యువత ఈ రంగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జల భద్రతే కీలకం**

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తూ.. "రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీరందిస్తామన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని గుర్తుచేశారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి తెలిపారు. "గోదావరి–కృష్ణా, తుంగభద్ర, పెన్నా–కావేరీ నదుల అనుసంధానంతో 4 రాష్ట్రాల్లో నీటి సమస్యలు తీరతాయి. గంగ, మహానది, గోదావరి నదులను కూడా కలిపితే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నీటి భద్రత సాధిస్తే దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రామోజీపై విమర్శలా? ముందు పోలవరం సంగతి చెప్పు!

వైసీపీ నేత అంబటి రాంబాబుపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, లక్షలాది మందికి ఉపాధి కల్పించిన రామోజీరావు గారిని విమర్శించడం ఆకాశంపై ఉమ్మివేయడమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. నైతికత గురించి మాట్లాడే అర్హతే లేని అంబటి రాంబాబు, రామోజీరావు వంటి మహనీయుడిపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. ఈనాడు, రామోజీ ఫిల్మ్ సిటీ, ఉషాకిరణ్ మూవీస్ వంటి సంస్థల ద్వారా తెలుగు వారి ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పిన రామోజీరావు సేవలను మంత్రి నిమ్మల గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుంచి జగన్ పాలన వరకు, ప్రజా సమస్యలపై గళమెత్తినందుకే రామోజీరావుపై, ఆయన సంస్థలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టి వేధించినా ఆయన న్యాయపోరాటం చేసి నిలిచారని అన్నారు. మార్గదర్శి వ్యవహారంలో ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, న్యాయస్థానం ఇచ్చిన స్పష్టతను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించవద్దని హితవు పలికారు. 2006లో మార్గదర్శిపై వివాదాలు సృష్టించినప్పుడు డిపాజిట్‌దారుల ప్రయోజనాలే పరమావధిగా భావించి, తన సొంత ఆస్తులను సైతం పణంగా పెట్టి చెల్లింపులు జరిపిన ఆయన విశ్వసనీయతను గుర్తుంచుకోవాలని అన్నారు. చిరునామాలు సరిగా లేని కారణంగా చెల్లించలేని డిపాజిట్లను కూడా ఎస్క్రో ఖాతాల్లో భద్రపరిచారని తెలిపారు. ఇంతటి నిజాయతీపరుడిని విమర్శించే ముందు, గత ప్రభుత్వంలో తన శాఖ పనితీరుపై అంబటి ఆత్మపరిశీలన చేసుకోవాలని నిమ్మల హితవు పలికారు. "జలవనరుల శాఖ మాజీ మంత్రిగా, పోలవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారో అంబటి రాంబాబు ప్రజలకు సమాధానం చెప్పాలి. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజాపక్షం వహించిన ఒక గొప్ప వ్యక్తిపై బురద చల్లడం ఎంతవరకు సమంజసం?" అని నిమ్మల ప్రశ్నించారు. రామోజీరావు గారి స్థాయికి, వైసీపీ నేతల స్థాయికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, ఎవరు ప్రజల కోసం నిలబడ్డారో, ఎవరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని విఫలమయ్యారో ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అంబటి వంటి వారి విమర్శలు రామోజీరావుపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఏమాత్రం తగ్గించలేవని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు

తాను రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీని అధికార పీఠం నుంచి దించే వరకు తన పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల్లోనే బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఎన్ఆర్సీ అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనగణనను ఒక సాకుగా వాడుకుంటోందని ఆరోపించారు. జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'అన్నపూర్ణ భండార్' పథకం కింద ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని, అనర్హత సాకుతో లబ్ధిదారుల సంఖ్యను కుదించడం ఎన్నికల వాగ్దానాలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇటీవల

జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. క్యాంపస్‌లలో హింసను ప్రేరేపిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు.. ట్రంప్ సంచలన నిర్ణయం

- మొదటి పేజి తరువాయి

2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. తమ దేశ వ్యవసాయ ఉత్పత్తులపై కెనడా అధిక సుంకాలను విధిస్తోందని, దీనివల్ల అమెరికా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ట్రంప్ ఆరోపించారు. కెనడా వైఖరి కారణంగానే తమకు 60 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. ఇకపై కెనడాను ప్రత్యేక దేశంగా పరిగణించబోమని, వాణిజ్య వ్యవహారాల్లో ఆ దేశంతో కలిసి ముందుకు సాగడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. కెనడా వాణిజ్యంలో 95 శాతం వాటా అమెరికాతోనే ముడిపడి ఉందని, తమతోనే ఆ దేశానికి అత్యధిక అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికాలో తయారైన వస్తువులకు మాత్రం ఈ సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఇరు దేశాల మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య చర్చలు విఫలమవ్వడంతోనే ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ నిర్ణయంపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా స్పందించారు. అమెరికాపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సుంకాలు సెప్టెంబర్ 8 నుంచే అమల్లోకి వస్తాయని ఆయన వెల్లడించారు. ఇప్పటికే కెనడాకు చెందిన 20 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో, తాజా పరిణామాలతో ఇరు దేశాల మధ్య వాణిజ్య పోరు మరింత ముదిరే అవకాశం ఉంది.

## ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా..

# టెక్నాలజీతోనే సేవలు

- మొదటి పేజి తరువాయి

విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలు తమ సమర్థతను పెంచుకుని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. ఈసారి పంటల దిగుబడి సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా నీరందించగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. సాగు ప్రారంభించని చోట్ల వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు పంపే క్రాప్ అలర్ట్‌లపై తీసుకుంటున్న చర్యలను కూడా పర్యవేక్షించాలని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రజారోగ్యంపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు వ్యాధి ప్రబలుతున్న హాట్‌స్పాట్‌లను గుర్తించి, తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే, గతేడాదితో పోలిస్తే ఈసారి డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయని అధికారులు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి 1,361 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 401 కేసులు మాత్రమే నమోదైనట్టు తెలిపారు. రాష్ట్రాన్ని కార్బన్ న్యూట్రల్ లక్ష్యం వైపు నడిపించాలని సీఎం ఆకాంక్షించారు. ఇందుకోసం పునరుత్పాదక ఇంధన వనరులపై, ముఖ్యంగా సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించి, ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

## మాట తప్పారంటూ కేంద్రంపై సీజేపీ ఆగ్రహం..

# సెప్టెంబర్ 5న భారీ నిరసన

- మొదటి పేజి తరువాయి

నేపథ్యంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలు, పోలీసుల వేధింపులకు గురైన బాధితులతో కలిసి ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ నిరసన ర్యాలీ సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుండి ఢిల్లీలోని నూతన పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు కొనసాగనుంది. జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని తాము దేశవ్యాప్త నిరసనలను విరమించుకున్నామని, అయితే ఇప్పుడు ప్రభుత్వం మాట తప్పిందని సీజేపీ ఆరోపించింది. ఇది యువతను, బాధితుల కుటుంబాలను వంచించడమేనని పార్టీ తన ప్రకటనలో పేర్కొంది. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని, ప్రభుత్వ వైఖరి కారణంగానే తాము మళ్లీ రోడ్డెక్కాల్సి వస్తోందని హెచ్చరించింది. ఆగస్టు 18న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదని సీజేపీ గుర్తుచేసింది. దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల జాబితాను అందిస్తే, వాటిని రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని కోర్టు పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదని తెలిపింది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి లిఖితపూర్వక హామీ అందలేదని వివరించింది. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు శాంతియుతంగా, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది. "ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి" అనేదే తమ ప్రధాన డిమాండ్ అని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# ఉద్యోగాలు భర్తీ చేయకుండా రిజర్వేషన్లకు ఎసరు

- మొదటి పేజి తరువాయి

రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం లేకుండానే రిజర్వేషన్లను అంతం చేసేందుకు ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకుందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఖర్గే కొన్ని కీలక గణాంకాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2015లో కేంద్ర ప్రభుత్వంలో 4.21 లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 8.24 లక్షలకు చేరింది. ప్రస్తుతం రైల్వే శాఖలో 2.40 లక్షలు, రక్షణ శాఖలో 2.41 లక్షలు, హోం మంత్రిత్వ శాఖలో 1.10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చడం ద్వారా రిజర్వేషన్ ఫలాలను దెబ్బతీస్తున్నారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను తొలగించారని, అదే సమయంలో కాంట్రాక్టు కార్మికుల వాటా 19 శాతం నుంచి 49 శాతానికి పెరిగిందని వివరించారు. "రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదు... రిజర్వేషన్లు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తే చాలు" అంటూ ఆయన తన పోస్టులో ప్రభుత్వాన్ని ఎండగట్టారు.

# మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు

- మొదటి పేజి తరువాయి

వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. "ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాం. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చాం.

నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశాం. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని ఎస్పీ కోరారు.

**సాధిక్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్**

సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# గడప గడప కు తెలుగుదేశం పార్టీ



**గాజువాక :పెన్ పవర్,ఆగస్టు 24** జీవీఎంసీ 66వ వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమం, అభివృద్ధి సంక్షేమం సమపాళ్లగా అందిస్తున్న ఈ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బూత్ :220లో నిర్వహించారు . డోర్ టు డోర్ కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి స్పందన , గత సైకో ప్రభుత్వం చేసిన పనులు వలన నష్టపోయామని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారని , భవిష్యత్తులో నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈ కూటమి ప్రభుత్వం దీర్ఘకాలంగా పరిపాలనలో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామంటూ అక్కచెల్లెల నుండి మంచి స్పందన రావడంతో కార్యకర్తలుగా చాలా సంతోషం వ్యక్తం చేశారని పార్టీ శ్రేణులు తెలిపారు . వార్డ్ అధ్యక్షుడు గోమాడ వాసు,బూత్ కన్వీనర్ జయలత, సీనియర్ నాయకుడు లక్ష్మణరావు, మైనార్టీ నాయకుడు మహమ్మద్ భాషా, బుజ్జి , పార్టీ నాయకురాలు పద్మ, నళిని, తదితరులు సర్వేలో పాలుగొన్నారు .

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# బొరాకలవలసలో రూ.79 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 24 :**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం పర్యటనలో భాగంగా అరకు వ్యాలీ మండలం బొరాకలవలస గ్రామంలో రూ.79 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారిని గిరిజన సంక్షేమ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, పీవో ఐటీడీఏ ఆదిత్య వర్మ, డాన్స్ కమిటీ చైర్మన్ గంగులయ్య, జీసీసీ డైరెక్టర్ బి. నాగరాజు, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, జీసీసీ చైర్మన్ కె. శ్రవణ్ కుమార్, జోన్--1 ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర్ర తదితరులు పాల్గొన్నారు.228 మంది జనాభా కలిగిన బొరాకలవలస గ్రామానికి రహదారి సౌకర్యం అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజల రాకపోకలకు మరింత సౌలభ్యం కలగనుంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అవసరాల కోసం సమీప ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలకు మెరుగైన రహదారి, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

# సూపర్ ఆడిట్‌లో గుర్తించిన లోపాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**పార్వతీపురం మన్యం జిల్లా,ఆగస్టు 24 పెన్ పవర్.** ఆడిట్‌లో భాగంగా గుర్తించిన వివిధ అంశాలు,లోపాలు మరియు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా.ప్రభాకర్ రెడ్డి ఈరోజు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించిన సర్వే,రెవెన్యూ,పంచాయతీరాజ్,ఇంజనీరింగ్,ఎంపీడీవో కార్యాలయాల అధికారులు,సిబ్బందితో పాటు సంబంధిత ఫిర్యాదుదారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.సూపర్ ఆడిట్ సందర్భంగా గుర్తించిన లోపాలు,ఫిర్యాదులపై సంబంధిత గ్రీవెన్స్ అధికారులు మరియు ఫిర్యాదుదారులతో జిల్లా కలెక్టర్ నేరుగా సమీక్షించారు.ఫిర్యాదులపై వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా,నిర్ణీత గడువులోగా పరిష్కరించి,పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు.అలాగే సూపర్ ఆడిట్‌లో గుర్తించిన లోపాలను పునరావృతం కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,ప్రభుత్వ నిబంధనలు మరియు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# ఓటర్ల జాబితా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి



### డ్రాఫ్ట్ రోల్‌పై అభ్యంతరాలుంటే ఆధారాలతో ఫిర్యాదు చేయాలి

### 18--19 ఏళ్ల యువత ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి: ఎస్ఐఆర్ రోల్ అబ్జర్వర్ ఎస్. భార్గవి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 24 :** పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విశాఖపట్నం జిల్లా రోల్ అబ్జర్వర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి కోరారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌పై అభ్యంతరాలు ఉన్నట్లయితే తగిన ఆధా రాలతో వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్--2026 ప్రక్రియపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్. భార్గవి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫారాల జారీ, సేకరణ, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలు, ఫారాలు తిరిగి సమర్పించని వారికి నోటీసుల జారీ, ఫారం--6, 7, 8 దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులు సమర్పించిన నివేదికలను రోల్ అబ్జర్వర్ సమీక్షించారు.జిల్లా పట్టణ ప్రాంతం అయినప్పటికీ ఓటర్ ఎన్యుమరేషన్ శాతం ఇతర జిల్లాలతో పోలిస్తే మెరుగ్గా ఉండటంపై ఎస్. భార్గవి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికారు లు, సిబ్బందిని అభినందించారు. ఓటర్ల నమోదును మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.

మ్యాపింగ్ లేని ఓటర్ల గుర్తింపు కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల అధికారిక గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఫారాలు తిరిగి సమర్పించని, వలస వెళ్లిన, మరణించిన ఓటర్ల జాబితాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి**

18--19 ఏళ్ల యువతను ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్. భార్గవి సూచించారు. 2026 అంచనా జనాభా ప్రకారం జిల్లాలో 18--19 ఏళ్ల వయసు కలిగిన యువతలో 1,04,866 మంది ఓటర్లుగా నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 4,787 మంది మాత్రమే నమోదయ్యారని తెలిపారు.

యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

బూత్ స్థాయిలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పేర్ల సవరణలు, డూప్లికేట్ ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వక ఆధారాలతో సమర్పిస్తే అధికారులు త్వరితగతిన రీ--వెరిఫికేషన్ చేసి పరిష్కరిస్తారని తెలిపారు. ఫారం--6, 7, 8 పెండింగ్ దరఖాస్తులపై ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో విచారణ పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన డేటాను సేకరించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.

**కొత్త పోలింగ్ కేంద్రాలకు బీఎల్ఏల నియామకం**

జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ, ఆబ్సెంట్, వలస వెళ్లిన లేదా తొలగించిన ఓటర్ల పేర్లు తిరిగి ఫారం--6 ద్వారా నమోదు చేసుకునే సందర్భంలో సంబంధిత కారణాలు, ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన 163 పోలింగ్ కేంద్రాలకు రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని కోరారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్‌ను ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని తెలిపారు. బీఎల్ఓ స్థాయి అధికారులు సహకరించకపోతే వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, అటువంటి ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ ఖేతన్ గార్గ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, ఈఆర్ఓలు పాల్గొన్నారు. బీజేపీ తరఫున ఎం.ఎం.ఎన్. పవన్ రామ రాజు, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్. సుధాకర్, బీఎస్పీ ప్రతినిధి పి. శివప్రసాదరావు, సీపీఐ(ఎం) ప్రతినిధి జి. కాంతారావు, టీడీపీ ప్రతినిధి ఎల్. రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఎన్. రవి, కె. కృష్ణకాంత్, జనసేన ప్రతినిధి కె. దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలి -ఎంఎల్ ఏ పల్లా





**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 24** పారిశ్రామిక ప్రాంతం గాజువాకరి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో గాజువాక ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించబడుతోంది. ఈ మేరకు గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ..సుమారు 100కు పైగా ప్రముఖ కంపెనీలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు, అర్హత కలిగిన యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ఈ జాబ్ మేళా ద్వారా 3,000కు పైగా ఆఫర్ లెటర్లు అందించేలా భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు . ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది ఒక గొప్ప అవకాశంగా నిలవనుందని, ఆగష్టు 29 శనివారం ఉదయం 9 గంటలనుండి శ్రీనగర్, టి ఎస్ ఆర్ టి బి కే కళాశాల మైదానంలో జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఐటి ఐ మరియు ఇతర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అన్నారు.యువతకు ఉపాధి కల్పించడం, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. కార్యక్రమంలో జిల్లా ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి అధికారులు డి. అరుణ, గోవింద రావు, కమలాకర్, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్,పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, రాజాన రామారావు తదితరులు పాల్గొన్నారు.




# దివ్యాంగుడి గోడు విన్న కలెక్టర్- ఇంటికే అధికారులను పంపిస్తానని భరోసా

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 24 :**ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మానవత్వాన్ని చాటుకున్నారు. కలెక్టరేట్ మెట్లు ఎక్కేందుకు వెళ్తున్న సమయంలో రెడ్‌క్రాస్ వాలంటీర్ సహాయంతో లిఫ్ట్ వైపు వెళ్తున్న ఓ దివ్యాంగుడిని గమనించిన కలెక్టర్ వెంటనే ఆగి అతని వద్దకు వెళ్లారు. “ఏమైంది.. మీ సమస్య ఏమిటి?” అంటూ ఆప్యాయంగా పలకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.భీమిలి మండ లం చిప్పాడ గ్రామానికి చెందిన జి. రాంబాబు మానసిక దివ్యాంగుడు. ప్రస్తుతం ఆయనకు దివ్యాంగుల కోటాలో నెలకు రూ.6,000 పింఛన్ అందుతోంది. రాంబాబు తల్లిదం డ్రులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా రు. రాంబాబు పోషణకు ప్రస్తుత పింఛన్ సరిపోవడం లేదని, బెడ్ రిడెన్ కేటగిరీ కింద నెలకు రూ.15,000 పింఛన్ మంజూ రు చేయాలని ఆయన తల్లిదండ్రులు కలెక్టర్‌కు విన్నవించారు.

వారి సమస్యను విన్న కలెక్టర్ వెంటనే స్పందించారు. సం బంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై రాంబాబును సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు తీసుకురావాల్సిన అవసరం లేదని, అధికారులు స్వయంగా వారి ఇంటికే వచ్చి వివరాలు తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.తమ సమస్యను చెప్పేం దుకు కలెక్టర్‌ను ప్రత్యేకంగా కలవాల్సిన అవసరం లేకుండానే, ఆయనే తమ వద్దకు వచ్చి ఆప్యాయంగా పలకరించి గోడు విన్నారని రాంబాబు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ మానవత్వంతో స్పందించి సమస్య పరిష్కారానికి భరోసా ఇవ్వడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు.



# పీజీఆర్ఎస్‌కు 21 ఫిర్యాదులు




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 24:** జీకేవీధి మండలం లకవరపుపేటలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మొత్తం 21 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు తెలిపారు. ఈ సందర్భంగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పాఠశాలలు, అంగన్వాడీ భవనాల మరమ్మతులు, పెన్షన్ల సమస్యలు, రెవెన్యూ తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీవో ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పై సురేష్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానజ్యోతి ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్య

- శిక్షణ తరగతులను అంగన్వాడి కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలి.
- ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి యు విమల కుమారి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 24.** జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యాను ప్రభుత్వం అందిస్తుందని ముంచంగిపుట్టు సిడిపిఓ యు విమల కుమారి అన్నారు. మండల పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలందరికి జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడవ విడత రెండవ రోజు శిక్షణా తరగతులు సోమవారం స్థానిక బాలుర పాఠశాల1లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ.. 6 సంవత్సరములలోపు పిల్లల సమ్మిళిత విద్య, లింగ వివక్షత, సంరక్షణకు పిల్లల అభివృద్ధి పలు అంశాలతో జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులుచే అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. అంగన్వాడి కార్యకర్తలకు ఉపాధ్యాయులు పి లింగన్న, కె లోకేష్, పి పుండరి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎస్ రాజేశ్వరి, సిహెచ్ వరహాలమ్మ, ఎస్ కొండమ్మ, సిహెచ్ స్వర్ణ ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడిలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 24:** ప్రజల నుంచి పీజీఆర్ఎస్ వేదికగా అందుతున్న వినతులను సత్వరమే పరిష్కరించి, సంతృప్తికరమైన ఫలితాలు అందిం చాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు 305 వినతులు సమర్పించారు. వీటిలో రెవెన్యూ శాఖకు 25, జీవీఎంసీకి 73, పోలీస్ శాఖకు 17, ఇతర శాఖలకు సంబంధించి 190 విన తులు నమోదయ్యాయి.డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసీ గోవిందు, ఏడీసీ సత్యవేణిలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.వినతుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఒకే సమస్యపై పదేపదే వినతులు రాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు.పీజీఆర్ఎస్‌లో నమో దైన ప్రతి వినతిపై తీసుకున్న చర్యలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సుంకరిమెట్టలో ప్రసూతి నిరీక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం పర్యటనలో భాగంగా అరకు వ్యాలీ మండలం సుంకరిమెట్ట గ్రామంలో రూ.35 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించిన ప్రసూతి నిరీక్షణ కేంద్రం ను గిరిజన సంక్షేమ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీ ఆదిత్య వర్మ, ఫోక్ అండ్ డ్యాన్స్ చైర్మన్ శ్రీ గంగుల్లయ్య, జీసీసీ డైరెక్టర్ శ్రీ బి. నాగరాజు, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి శ్రీమతి గిడ్డి ఈశ్వరి, జీసీసీ చైర్మన్ శ్రీ కె. శ్రవణ్ కుమార్, జోన్--1 ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీ దొన్ను దొర్ర తదితరులు పాల్గొన్నారు.మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణీ మహిళలకు ప్రసవానికి వారం రోజుల ముందుగానే సురక్షితమైన వసతి కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక సౌకర్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో గర్భిణీ మహిళలకు సకాలంలో వైద్య సేవలు అందేలా ఇటువంటి సౌకర్యాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమె పేర్కొన్నారు.




# రేవళ్లు పిజిఆర్ ఎస్ లో 25 అర్జీలు

**మండల అభివృద్ధి అధికారి "జెడివి ప్రసాద్ రావు"**

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 24** :ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు రేవళ్లు స్వర్ణ గ్రామ పిజీ ఆర్ఎస్ గ్రీవెన్స్ లో 25 అర్జీలు అందాయని మండల అభివృద్ధి అధికారి జెడివి ప్రసాదరావు తెలిపారు. వీటిలో రెవెన్యూ సమస్యలు 19, సివిల్ సప్లై గ్యాస్ 2, ఆరోగ్యశాఖ 1, విద్యాశాఖ 1, డి ఆర్ డి ఓ 1, మత్స్యశాఖ 1 అర్జీలు అందడం జరిగిందన్నారు. వీటిని సంబంధిత అధికారులకు అందజేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ




ఇంజనీర్ రామకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ సాయి కృష్ణ తోపాటు వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సన్నద్ధం కావాలి...!



- మంపలో ఇంటింటికి టిడిపి ప్రచార కార్యక్రమం
- మండల టిడిపి ప్రధాన కార్యదర్శి "తోట దొరబాబు"


**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 24:** త్వరలో జరిగే స్థానిక సమరానికి టిడిపి కార్యకర్తలు సన్నద్ధం కావాలని మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోటా దొరబాబు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలో మంపలో 75 ,76 ,84 బూత్ ల్లో ఇంటింటికి టిడిపి ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తోట దొరబాబు మాట్లాడుతూ అక్టోబర్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండబోతున్నాయని స్పష్టమైన సమాచారం ఉందని దీంతో పార్టీ క్యాడర్ అంతా సన్నద్ధం కావాలని ఆయన స్పష్టం చేశారు. నెలరోజుల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని ప్రతి చోట గెలిపే లక్ష్యంగా అందరూ అడుగులు వేయాలని కోరారు కూటమి నేతలు గెలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యకర్తల చేతుల్లో అభివృద్ధి సంక్షేమం ఆయుధాలు పెట్టారని వాటిని ఉపయోగించుకునే వితానంలోనే గెలుపు ఆధారపడి ఉందన్నారు. వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు పెన్షన్లు అందిస్తున్నామని పట్టా ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ ద్వారా సంవత్సరానికి 20వేల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని తెలిపారు అలాగే మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ట్రైకార్ రుణాలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి చేరవేయడంతోనే స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. గత శాతం విజయం సాధించే శక్తి సామర్థ్యాలు మనందరికీ ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిపోయిన సత్తిబాబు కో క్లస్టర్ పాడి వెంకటేష్ టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కృష్ణాపురంలో పల్లె నిద్ర ప్రజల్లో భరోసా.. శాంతిభద్రతలపై పోలీసుల అవగాహన

**పద్మనాభం, ఆగస్టు 24 (పెన్ పవర్):** విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో సోమవారం 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. సీఐ ఎం. చంద్రమౌళి ఆధ్వర్యంలో పోలీసు బృందం గ్రామంలో రాత్రి బస చేసి, స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, సామాజిక వర్గాల ప్రతినిధులతో మాట్లాడి గ్రామంలోని పరిస్థితులను తెలుసుకున్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలు, స్థానిక వివాదాలు, వర్గ విభేదాలు, సున్నిత ప్రాంతాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై పోలీసులు ముందస్తు సమాచారాన్ని సేకరించారు. అలాగే రాత్రిపూట గ్రామంలో గస్తీ నిర్వహిస్తూ సున్నిత ప్రాంతాలను పరిశీలించారు.

ప్రజల సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రజల్లో భయాన్ని తొలగించి, పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించడంతో పాటు పోలీసు--ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే 'పల్లె నిద్ర' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సీఐ చంద్రమౌళి తెలిపారు.



ఈ కార్యక్రమంలో సీఐ ఎం. చంద్రమౌళి, ఎస్ఐ బి. గణేష్, పోలీసు సిబ్బంది శంకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పునర్విక ఫ్రీజర్ బాక్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలి.

**మాజీ సర్పంచ్. బొత్తాడ గౌరీ శంకరరావు,**

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 24 పెన్ పవర్.** మండలంలో గుమ్మలక్ష్మీపురం గ్రామపంచాయతీలో దాతల సహకారంతో పంచాయతీ మోటార్ షెడ్డులో ఏర్పాటు చేసిన ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామ ప్రజలు కష్టకాలంలో అవసరానుసారం వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు తెలిపారు.గ్రామానికి చెందిన పెద్దలు కింతలి పాండురంగారావు సోదరులు,బుడంకాయల వెంకటరావు ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామ ప్రజల సేవ కోసం విరాళంగా అందించారు.అలాగే దోస్త్ మేరా దోస్త్ సేవా గ్రూప్ సుమారు రూ.50,000 ఖర్చు చేసి పంచాయతీ మోటార్ షెడ్డును మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన దారి మరియు ఇతర సౌకర్యాలను కల్పించి వినియోగంలోకి తీసుకువచ్చింది.అదేవిధంగా పునర్విక పాప తండ్రి అభ్యర్థన మేరకు ఆమె కోసం సేకరించిన విరాళాల నుంచి మిగిలిన మొత్తాన్ని షెడ్ మరియు దారి నిర్వహణకు వినియోగించడం జరుగుతోంది.ఈ ఫ్రీజర్ బాక్స్ నిర్వహణ బాధ్యతలను దోస్త్ మేరా దోస్త్ సేవా గ్రూప్ మరియు గ్రామపంచాయతీ కలిసి చూసుకుంటాయి.గ్రామంలో ఎవరికైనా కష్టకాలంలో ఫ్రీజర్ బాక్స్ అవసరమైతే క్రింది నంబర్లను సంప్రదించవచ్చున్నాని సంప్రదించవలసిన నంబర్లు,బొత్తాడ గౌరీ శంకరరావు(మాజీ సర్పంచ్):8985175378,పాలక ప్రేమానంద్(దోస్త్ మేరా దోస్త్)9392507572,తుంబలి వినోద్ కుమార్(హెల్పింగ్ హ్యాండ్స్)9493707072,మద్ది నాని(ప్రెస్)9441956957,రవాణా కోసం వాహన యజమాని,వూన్న ఏసుపాదం,9381074127




మినిమం మెంటెనెన్స్ చార్జీలు/రవాణా కోసం వాహన ఛార్జీలు వర్తిస్తాయన్నారు.కష్టకాలంలో మన గ్రామ ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ సేవను అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.దాతలు,సేవా సంస్థలు అందిస్తున్న సహకారానికి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు.తెలిపారు.

## లవ్ జిహాద్ కుట్రలో ఆత్మహత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి...!

- కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు కు ఫిర్యాదు
- మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు "సంపరి శివకుమార్"



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 24:** లవ్ జిహాద్ కుట్రలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న నాగరాజు కుటుంబం ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షురాలు మఠం శాంతి కుమారి పిలుపుమేరకు సోమవారం కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడం జరిగిందని మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు సంపరి శివకుమార్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న నూకరాజు కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకొని మరణించిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని శివకుమార్ అన్నారు. లవ్ జిహాద్ కుట్రకు సంబంధించిన అంశాలు ఉన్నాయని ఆరోపణలు నేపథ్యంలో నిజ నిజాలను వెలికి తీసేలా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనకు కారణమైన వ్యక్తులు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు నెల్లి సత్తిబాబు మేడిబోయిన చక్ర రావు (చిన్న) పాల్గొన్నారు

## పూరీ వెళ్లే పలు రైళ్లకు పాక్షిక రద్దు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 24 :** ఖుర్దా రోడ్ డివిజన్ పరిధిలోని పూరీ రైల్వే స్టేషన్‌లో 5, 6వ ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి పనులు, భద్రతాపరమైన ఆధునీ కరణ పనుల నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకల్లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా తేదీల్లో కొన్ని రైళ్లు పూరీకి బదులుగా మలతీపట్పూర్ ఎం ఎల్ టి స్టేషన్ వరకు మాత్రమే నడవనున్నాయి. అక్కడి నుంచే తిరుగు ప్రయాణాన్ని ప్రారంభించనున్నాయి.

తిరుపతి--పూరీ ఎక్స్‌ప్రెస్ 17480

ఆగస్టు 25, 26, 27, 29, 30 తేదీల్లో, సెప్టెంబర్‌లో 1, 2, 3, 5, 6, 8, 9, 10, 12, 13, 15, 16, 17, 19, 20, 22, 23, 24, 26, 27, 29, 30 తేదీల్లో, అక్టోబర్‌లో 1, 3, 4, 6, 7, 8, 10, 11, 13, 14, 15, 17, 18, 20 తేదీల్లో తిరుపతి నుంచి బయలుదేరే రైలు పూరీకి బదులుగా మలతీపట్పూర్ వరకు మాత్రమే నడుస్తుంది.

పూరీ--తిరుపతి ఎక్స్‌ప్రెస్17479

ఆగస్టు 26, 27, 28, 30, 31 తేదీల్లో, సెప్టెంబర్‌లో 2, 3, 4, 6, 7, 9, 10, 11, 13, 14, 16, 17, 18, 20, 21, 23, 24, 25, 27, 28, 30 తేదీల్లో, అక్టోబర్‌లో 1, 2, 4, 5, 7, 8, 9, 11, 12, 14, 15, 16, 18, 19 తేదీల్లో పూరీకి బదులుగా మలతీపట్పూర్ నుంచి తిరుపతికి బయలుదేరుతుంది.

గాంధీధామ్--పూరీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22973)

ఆగస్టు 28, సెప్టెంబర్ 4, 11, 18, 25, అక్టోబర్ 2, 9, 16 తేదీల్లో గాంధీధామ్ నుంచి బయలుదేరే రైలు పూరీకి బదులుగా మలతీపట్పూర్ వరకు మాత్రమే నడుస్తుంది.

పూరీ--గాంధీధామ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22974)

ఆగస్టు 29, సెప్టెంబర్ 5, 12, 19, 26, అక్టోబర్ 3, 10, 17 తేదీల్లో పూరీకి బదులుగా మలతీపట్పూర్ నుంచి గాంధీధామ్‌కు బయలుదేరుతుంది.

ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, భద్రతాపరమైన ఆధునీకరణ పనుల కారణంగా ఈ మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు రైళ్ల రాకపోకల్లో మార్పులను గమనించి, తదనుగుణంగా తమ ప్రయాణాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. రైళ్ల మార్పుల వల్ల కలిగే అసౌకర్యానికి రైల్వే అధికారులు చింతిస్తున్నట్లు పేర్కొన్నారు.

# పార్టీ కార్యకర్తల క్షేమం కోసం మెడికల్ క్యాంప్.



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 24 పెన్ పవర్.** మండలలో టీడీపీ కేడర్‌కు ఉచిత వైద్య పరీక్షలు పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న0 టీడీపీ కార్యకర్తల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు.సోమవారం నాడు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో మండల తెలుగుదేశం పార్టీ కేడర్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు పార్టీ కార్యకర్తల సంక్షేమాన్ని కూడా సమానంగా పరిగణిస్తోందన్నారు.ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.వైద్య శిబిరంలో టీడీపీ కేడర్‌కు సాధారణ ఆరోగ్యపరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యులు ఆరోగ్య సూచనలు,సలహాలు అందించారు.కార్యక్రమంలో కురుపాం వ్యవసాయం మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి,మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,టీడీపీ మండల నాయకులు,కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భయం గుప్పెట్లో చదువులు - కారుతున్న పైకప్పులు





- దాబుగూడ పాఠశాల విద్యార్థుల అవస్థలు వర్ణనతీతం.
- 31మంది పాఠశాల విద్యార్థులకు కారిపోతున్న పాఠశాల భవనంలోనే విద్య బోధన.
- విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే కొత్త పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలి.
- లక్ష్మీపురం పంచాయతీ మాజీ సర్పంచ్ కొర్ర త్రినాథ్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 24.**ఎడతెరిపి లేకుండా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గిరి విద్యార్థులు భయం గుప్పిట్లో కారుతున్న పైకప్పుల క్లాస్‌రూమ్ లో చదువుకుంటున్నారు. తరగతి భవనంలో వర్షపు నీరు కారి బ్యాగులు, పుస్తకాలు తడిచి పోతున్నాయి. తరగతి గదులు నీటి కుంటలుగా మారి తరగతి గది లోపల నీరు చేరి విద్యార్థులు కూర్చోవడానికి కూడా స్థలం లేకుండా పోవటంతో చదువుకు ఆటంకంగా మారాయి. వర్షం పడినప్పుడల్లా క్లాసులు ఆపేసి విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. ఈ దయానియమైన పరిస్థితి అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం, మారుమూల లక్ష్మీపురం పంచాయతీ, దాబుగూడ గ్రామంలోనీ మండల పరిషత్ పాఠశాలలో నెలకొంది. లక్ష్మీపురం పంచాయతీ మాజీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయిన ఆదివాసి ప్రాంతాల్లో విద్యార్థుల చదువుకు సరైన పాఠశాల భవనాలు లేదన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతంలో భావి భారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలు కొద్ది పాటీ వర్షం కారణంగా మొత్తం కారిపోతుందని, విద్యా నేర్చుకోవాలని ఎంతో ఆశతో కారిపోతున్న పాఠశాల భవనంలోనే కూర్చుని విద్యా నేర్చుకుంటున్న గిరిజన విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం అన్నారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దాబుగూడలో తరగతి గది పై కప్పులు సరిగ్గా లేని కారణంగా నీరు మొత్తం కారిపోవడంతో కూర్చోవడానికి అవకాశంలేక 31 మంది విద్యార్థులు ఇబ్బంది తీవ్ర పడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పాఠశాల భవనం మరమ్మతు చేయాలని లేదా కొత్త భవనం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు గిరిజన ప్రాంత అభివృద్ధి అని పత్రికల్లో టీవీల్లో మైక్ పట్టుకుని గొప్పలు చెప్పు కోవడంతోనే సరిపోతుందని గ్రౌండ్ లెవెల్లో పరిస్థితి దారుణంగా ఉందని, దీంతో విద్యార్థులు పాఠశాలకు దూరమయ్యే అవకాశం ఉందనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంబంధించిన విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు

# రోడ్డుపై ఏర్పడిన గుంతలో ఇరుక్కున్న భారీ వాహనం

- కాంగువీధి బ్రిడ్జి వద్ద ఘటన - వాహనదారులు తీవ్ర ఇబ్బంది.
- ప్రధాన రహదారులు ఏర్పడ్డ గుంతలు పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 24.**భారీ వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతల్లో భారీ వాహనాలు దిగిపోతూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రం మీదుగా రూడకోట బూసిపుట్టు, జామిగూడ, ఒడిస్సా వెళ్ళే ప్రధాన రహదారి కాంగువీధి దేగలపుట్టు గ్రామల సమీపంలో గల బ్రిడ్జ్ వద్ద భారీ గుంతలు ఏర్పడడంతో అక్కడ వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం రూడకోట సంతకు వెళ్ళే భారీ వాహనం రహదారిపై గుంతలో దిగి ఇరుక్కు పోవటంతో గంటల తరబడి శ్రమించి తీవ్ర ఇబ్బందులతో బయటకు తీశారు. రహదారులపై ఉన్న గుంతలు పూడ్చలనీ గతంలో పత్రిక కథనాలు వెలుబడినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి గుంతలు కనిపించక వాహనాలు అకస్మాత్తుగా వాటిలో దిగిపోతున్నాయి. భారీ వాహనాలు ఇరుక్కుపోవడంతో రోడ్లపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవటమే కాక ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారు. వాహనాలు దెబ్బ తింటున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలనీ, రోడ్లపై నిలిచిన నీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలనీ, అత్యవసర మరమ్మతుల కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వానికి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి



**ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: బీజేపీ**

**రంపచోడవరం డీఎస్పీకి వినతిపత్రం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 24:** ఏఈ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఆత్మహత్య ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలవరం జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఈకా బుల్లి కొండల దొర తదితర నాయకులు సోమవారం రంపచోడవరం డీఎస్పీ అష్రఫ్ అలీ కి వినతిపత్రం సమర్పించారు. పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, నూకరాజు కుటుంబానికి జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఘటనలో మోసం, వంచన, దోపిడీ, హత్య తదితర ఆరోపణలు ఉన్నాయని, వీటిపై సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే తాము పేర్కొంటున్న 'లవ్ జిహాద్' కోణంలోనూ దర్యాప్తు జరిపించాలని వారు పోలీసులను కోరారు.దర్యాప్తులో ఆరోపణలు రుజువైతే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసును ఎటువంటి పక్షపాతం లేకుండా దర్యాప్తు చేసి, వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలని కోరారు.బాధిత నూకరాజు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరిపి, బాధిత కుటుంబానికి అవసరమైన న్యాయ సహాయం, రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఈకా బుల్లికొండలుదొర, రంపచోడవరం మండల అధ్యక్షుడు చోడి జంగం, మండల ప్రధాన కార్యదర్శి గణిరాజ్, మాజీ మండల అధ్యక్షుడు ముర్లా బాలురెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుర్రంబాబు రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కూనవరం ఆదివాసీ గిరిజన సంఘం కొత్త కమిటీ...

**-12 గ్రామాలకు భూమి ప్యాకేజీ,ఆర్అండ్ఆర్ ఇవ్వాలని డిమాండ్**




**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 24.** కూటూరులో ఆదివాసీ గిరిజన సంఘం మండల మహాసభ ఘనంగా నిర్వహించారు.సున్నం వెంకటేష్ అధ్యక్షులుగా,తెల్లం తమ్మయ్య కార్యదర్శిగా 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ముంపు ప్రభావిత 12 గ్రామాలకు వెంటనే భూమి ప్యాకేజీ,ఆర్అండ్ఆర్ పునరావాసం కల్పించాలని,1/70 యాక్ట్ పిసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని తీర్మానించారు.

జిల్లా కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమాలు చేపడతామని, డిమాండ్లు నెరవేరకపోతే ఐటీడీఏ ముట్టడిస్తామని హెచ్చరించారు. మండలంలో 48 గ్రామాలు ముంపులో ఉన్నా కాంటూరు లెక్కల పేరుతో మోసం చేస్తున్నారని మహాసభ లో ఆవేదన వ్యక్తం చేశారు.మండల కమిటీ సభ్యులుగా బొగ్గ రామారావు,సోడే శంకర్, బాబు బొర్రయ్య,నూప రాజు,ధర్ముల అమ్మాజీ,జోడే రాజు మడకం పొదయ్య,కొమరం మోహన్,బోగ్గ సమ్మక్క,మోసం హరీష్,శీలం పిచ్చయ్య,బొగ్గ వెంకయ్య,పైదా శ్రీకాంత్,చిచ్చడి సత్యనారాయణ,మడకం శిరమయ్య,పైదా వెంకమ్మ,కుంజ సుధాకర్,గుండం బాబురావు, ఊయక తమ్మయ్య తదితరులు నూతన కమిటీలో ఎన్నికయ్యారు.

# జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

**చింతూరులో ఏఎస్పీ, ఏపీవోలకు వినతిపత్రం**

**చింతూరు: పెన్ పవర్, ఆగస్టు 24:** రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం చింతూరు ఏఎస్పి బొడ్డు హేమంత్, ఐటిడిఏ ఏపీవో రామతులసికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాసినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ మైనింగ్ మాఫియా ఆగడాలపై నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల విశాలాంధ్ర విలేఖరి గోవిందు పై దాడి ఘటనే దీనికి నిదర్శనమని అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని, దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ అధ్యక్షుడు ఎండి షౌఖత్ అలీ, కార్యదర్శి నీలపు రాజేష్ రెడ్డి, యూనియన్ నాయకులు, సభ్యులు మసకపల్లి సత్తిబాబు బెజ్జంకి శ్రీనివాసచారి, బెజ్జంకి ఈశ్వర చారి, బెజవాడ నాగేంద్ర కుమార్, బేడే సతీష్, షేక్ రియాజ్, కొడమంచిలి జీవన్ కుమార్, కాక సీతారామయ్య, షేక్ ఖాదర్, తమ్మినేడి రామారావు, సురేష్ చౌదరి, రాజు, గెడ్డం వెంకటేశ్వర్లు, నెల్లూరి రమేష్, షేక్ బాష, మాడి ముత్యాలరావు, బొర్రా రామారావు,
పిడియాల మోహనరావు, వెంకన్న పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పీజీఆర్ఎస్ కు 23 వినతులు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 24:**ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో , క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలను మూసివేయ కుండా, సమస్య ను క్షేత్రస్థాయిలో నిర్ధారించు కోవాలని స్పష్టం చేశారు. సాధ్యంకాని పక్షంలో వివరాలను అర్జీదారులకు తెలియజేసి వారి అభిప్రాయాన్ని నమోదు చేసిన అనంతరం అర్జీని ముగించాలని సూచించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ముందు-తర్వాత తీసిన ఫోటోల ఆధారాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 23 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ కి 7, రెవెన్యూకి 3, టౌన్ ప్లానింగ్ కి 8, పబ్లిక్ హెల్త్ కి 4, పంచాయతీ రాజ్ ఒకటి ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## లవ్ జిహాదీ సాదిక్,ఖాన్‌ను కఠినంగా శిక్షించాలి.



**-బి.జె.పి.పార్టీ,మండలకమిటీనాయకులు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.24** భారతీయజనతాపార్టీ,మండలకమిటీనాయకులు ఆధ్వర్యంలోరాష్ట్రపార్టీపిలుపుమేరకు,సమావేశం ఏర్పాటు చేశారు.బి.జె.పి.ఎస్.టి.మటరీర్చారాష్ట్ర నాయకులుపాయంవెంకయ్య,మాట్లాడుతూ కాకి నాడకుచెందిన,ఏ.ఈ,నూకరాజుకుమార్తెను ప్రేమ పేరుతోనమ్మించి,మోసంచేసి,నూకరాజు కుటుంబాన్ని ఇస్లాంమతంలోకి ,మారాలనివారిఆస్తులను,తన పేరిట బదలాయింపు,రాయాలని,నూకరాజుకుటుంబాని ఆత్మ హత్యకు,ప్రేరేపించిన,ముస్లింయువకుడు సాధిక్ ఖాన్, నికఠినంగాశిక్షించాలని, డిమాండ్,చేశారు. అనంతరంసోమవారంవి.ఆర్.పురం,ఎస్.ఐ.కుపైన తెలపబడిన,సమస్యతోకూడినవినతిపత్రాన్నిఅంద జేశారు.రాష్ట్రం లోహిందూమతంవారిఫిర్యాదుల పై,రాష్ట్రపోలీసుశాఖ,యంత్రాంగంస్పందించాలని , కోరారు.రాష్ట్రంలోహిందు వులుఇస్తున్నఫిర్యాదు లనుపోలీసుశాఖ,వారు కేవలం నామమాత్రమే చర్యలుఉంటాయని,దీనికిఉదాహరణ,నూకరాజు కుటుంబం(బలి)మృతి,అయిందన్నారు.ఈ కార్య క్రమంలోబిజెపిఎస్.టి.మోర్చారాష్ట్రనాయకులు పాయంవెంకయ్య,వి.ఆర్.పురంమండలఅధ్యక్షు లు ముత్యాలరాంబాబు, మండలసెక్రెటరీ, ఉయికరత్తయ్య, సీనియర్,నాయకు లుకడుపురాజేంద్ర,గిరిజనమోర్చా డివిజన్,నాయకులుసొందినాగేశ్వరావు,తదితరు లు పాల్గొన్నారు.

## డీఎస్సీ నూతన ఉపాధ్యాయినులకు అభినందనలు



**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 24;**ఇటీవల జరిగిన డీఎస్సీలో విజయం సాధించి ఉపాధ్యాయులుగా నియామకం పొందిన నగరానికి చెందిన ఐదుగురు నూతన ఉపాధ్యాయినులను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) కలిసి అభినందించారు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి విజయలను తెలుసుకు న్నారు. 10వ డివిజన్‌కు చెందిన ముసలిగంటి సంతోషి రమా కల్యాణి, 3వ డివిజన్‌కు చెందిన గంటి గేయరూపిణి, 45వ డివిజన్‌కు చెందిన నయనాల కేదారేశ్వరి, 37వ డివిజన్‌కు చెందిన గిరిజ కుమారి, 35వ డివిజన్‌కు చెందిన కుసుమ రత్న సౌజన్యలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కలిసి అభినందించారు. వారిని సత్కరించి, ప్రసిద్ధ రత్నం పెన్నులను జ్ఞాపికగా అందజేశారు.నూతన ఉపాధ్యాయినులు మాట్లాడుతూ డీఎస్సీ కోసం సంవత్సరాలుగా నిరీక్షించామని, ఉద్యోగం సాధించడమే తమ జీవిత లక్ష్యంగా రాత్రింబవళ్లు కష్టపడి చదివామని తెలిపారు. కుటుంబం, పిల్లలు, వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి ఉద్యోగం కోసం ఎంతో శ్రమించామని, చివరకు తమ కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని భావోద్వేగంగా చెప్పారు. డీఎస్సీ ఉద్యోగాలు తమ జీవితాలను మార్చాయని, కుటుంబానికి భరోసా కల్పించాయని పేర్కొన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలం



**వై సి పి నేత జక్కంపూడి విజయలక్ష్మి ధ్వజం**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 24:**రాష్ట్రంలో మహిళలు, యువతులకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కం పూడి విజయలక్ష్మి ఆరోపించారు. స్థానిక ప్రకాష్‌నగర్ లోని కార్తికేయ అపార్ట్‌మెంట్ వద్ద సోమవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లా డారు. కూటమి ప్రభుత్వం లో మహిళ లపై దాడులు, హత్యలు, అత్యా చారాలు,అకృత్యాలు పెచ్చుమీరాయని ఆరోపించారు. మహిళల దిశ చట్టాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నగరంలో మెడికో విద్యార్థిని ప్రియాంక మృతి ఘటన నగరానికి మాయని మచ్చగా మిగిలిం దన్నారు. లోకేష్ భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ‘రెడ్ బుక్ రాజ్యాంగం’ నడుపుతున్నారని ఆరోపించారు. మహిళలపై అకృత్యాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మహి ళలకు 50 ఏళ్లకే పింఛన్లు , ప్రతి మహిళ నెలకు రూ.1,500 చెల్లిస్తామని,నిరుద్యోగులకు రూ.3,000 చెల్లిస్తామని హామీలు అమలు చేయక మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఉద్యమిస్తామని జక్కంపూడి విజయలక్ష్మి ప్రకటించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కొండేపూ డి లక్ష్మీ శిరీష, నగర మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, సిహెచ్. ఉమామహేశ్వరి, దేవులపల్లి సరిత రాణి, పసుపులేటి దుర్గాదేవి, నిడు బోలు ధనలక్ష్మి,ఎం. శైలజ తది తరులు పాల్గొన్నారు.

## ఏఈ నూకరాజు ఆత్మహత్య పై బిజెపి ఆగ్రహం



**సాదిక్ ఖాన్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**డీజీపీ,హోం మంత్రి స్పందించాలని**

**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు24.** ఇంటర్నేషనల్ స్కూల్లో రైఫిల్ షూటింగ్ ట్రైనర్ గా పనిచేస్తున్న సాదిక్ ఖాన్ వల్ల ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నోముల రామారావు,గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకయ్య అన్నారు.కూనవరం పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ బి రామకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు.వారు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.శిక్షణ పేరుతో సాదిక్ ఖాన్ నూకరాజు కోడలు సౌజన్య ను పరిచయం చేసుకొని, బ్లాక్మెయిల్ చేసి కోట్ల రూపాయలు, బంగారం తీసుకున్నాడని,చివరకు కుటుంబ ఆస్తులను తన పేరుకు రాయాలని,ఇస్లాం మతం స్వీకరించాలని ఒత్తిడి తెచ్చాడని పేర్కొన్నారు.ఈ వేధింపులు తట్టుకోలేక నూకరాజు కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారని,12 ఏళ్ల మనవడు కార్తికేయ మాత్రమే బతికాడని తెలిపారు.ఈ కేసులో వంచన, మోసం,దోపిడి,బ్లాక్మెయిల్ ఉందని, దీనిపై లవ్ జిహాద్,ఉగ్రవాద కోణం లో కూడా దర్యాప్తుజరపాలనిబిజెపి పార్టీ తరఫున డిమాండ్ చేశారు. పరారీలో ఉన్న సాదిక్ ఖాన్ ఢిల్లీలో అరెస్ట్ అయ్యాడని,అతనికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో లవ్ జిహాద్ కేసులపై పోలీసులు చేపట్టిన చర్యలు, నమోదైన ఎఫ్ఐఆర్ ల వివరాలను డీజీపీ మరియు హోం మంత్రి ప్రకటించాలని డిమాండ్ చేశారు. నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని,సాదిక్ ఖాన్ ను కఠినంగా శిక్షించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కరక పవన్,సీనియర్ నాయకులు కారం దారయ్య,గేద శ్రీనివాస్,ఉయిక రత్తయ్య, వీరబాబు పాల్గొన్నారు.

## చిన్నారులను పట్టించుకునే వారే లేరు



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 24;** పి అంకంపాలెం గ్రామంలో కలుపు మందు కలిసిన పంచాయితీ నీరు త్రాగి 12 మంది చిన్నారులు అస్వస్థకు గురైన సంఘటన తెలిసిందే. అయితే అప్పటినుండి అధికారులు, నాయకులు ఆ విద్యార్థుల ఆరోగ్యాన్ని పట్టించుకునే వారే లేరని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటినుండి ఇప్పటివరకు విద్యార్థు లు అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు బెంగ పెట్టుకుంటున్నారు. అధికారుల దగ్గరకు వెళితే ఆరోగ్యం బాగానే ఉంది కదా వెళ్లండి అంటూ సమాధానం చెబుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. ఇదే అదునుగా భావించి విద్యార్థుల వైద్యుల ఖర్చు కోసం ,మరొకరికి ఇవ్వాలని, మధ్యవర్తిగా వ్యవహరించే వ్యక్తి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్ కృష్ణమూర్తిని వివరణ కోరగా విద్యార్థుల కలుషిత నీరు త్రాగిన దానిమీద స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన మీద చర్యలు తీసుకుంటారని తెలిపారు. కలుషిత నీరు తాగిన విద్యార్థులు ఆరోగ్యం పై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# ట్రస్ట్ బోర్డు సమావేశం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 24;** ద్వారకా తిరుమల లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపేందుకు బోర్డు సభ్యులు అంకితభావంతో ఉండాలని సోమవారం సమావేశంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సుధాకరరావు సూచించారు. 28 రోజులపాటు జరిగే ప్రత్యేక పూజ లలో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని జనసేన నేత, మాజీ జెడ్పిటిసి, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ అన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ ఎస్ జగన్నాధపురం శ్రీ లక్ష్మీనరసింహ ఆలయానికి మహర్దశ కలుగుతుందని అన్నారు. ద్వారకాతిరుమల నుండి ఐఎస్ జగన్నాధపురం వరకు నాలుగు లైన్లు రహదారి ,జంగారెడ్డిగూడెం నుండి జగన్నాధపురం వరకు రెండు లైన్లు రహదారి నిర్మాణ అంశాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 19 వరకు 28 రోజులపాటు ప్రతిరోజు ఉదయం స్వామివారి మూలమూర్తులకు, అభిషేకం, విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

## కాంట్రాక్టుఉద్యోగుల సమస్యలుపరిష్కరించాలి.




**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.24**వైద్యఆరోగ్యశాఖలోపనిచేస్తున్న,కాంట్రాక్టుఉద్యోగుల సమస్యలుతక్షణమే,పరిష్కరించాలని,కోరుతూసోమ వారంకాంట్రాక్టుఎంప్లాయిస్, జాయింట్,యాక్షన్,రాష్ట్ర కమిటీఆధ్వర్యంలోప్రభుత్వప్రాథమికఆరోగ్యకేంద్రం వద్దనల్లబ్యాడ్జీలతో,డ్యూటీ చేస్తూనిరసన,కార్యక్రమం చేపడంజరిగింది.కాంట్రాక్టు, ఉద్యోగులడిమాండ్, కాంట్రాక్టుఉద్యోగులను,రెగ్యులర్,చేయాలని,రెగ్యు లర్,అయ్యేవర కువందశాతంగ్రాస్, శాలరీఇవ్వాలని, ఈపీఎఫ్,సౌకర్యంకల్పించాలని ,డ్యూటీలోఉన్నకాంట్రా క్టుఉద్యోగిమృతిచెందితే,యాబైలక్షలఎక్స్ గ్రేసియాతో పాటు ఆకుటుంబంలోఒకరికి ,ఉద్యోగవకాశం కల్పిం చాలని,డిమాండ్,చేశారు. సంవత్సరాలుగాసేవలంది స్తున్న,కాంట్రాక్టుఉద్యోగులురెగ్యులర్, కాకపోవడం చాలాబాధాకరమన్నారు.మాసమస్యపైప్రభుత్వాని కి,చాలాసార్లువినతిపత్రాలు అందజేసినాఫలితంలేక, పోవడంతోసమ్మెకుసన్నద్ధంకావలసి,వచ్చిందని,పేర్కొ న్నారు.ఈకార్యక్రమంలోఎం.శాంతిప్రియ,కె.సుబ్బమ్మ, ఎస్.కళావతి,ఎస్.శ్రీనివాస్,కె.రత్తయ్య,ఏ.సతీష్,తది తరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని వ్యక్తి మృతి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 24;** చెట్టుకు ఉరేసుకుని తెల్లం వెంకటేశ్వరరావు (53) మృతి చెందిన సంఘటన సోమవారం వంక వారి గూడెం పంచాయతీ రమణక్కపేట సమీపంలో టేక్ ప్లాంటేషన్లు జరిగింది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయిగూడెం మండలం కోయ అంకంపాలెం గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. గత మూడు సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడని భార్య తెలిపిందని అన్నారు. శనివారం హాస్పిటల్ కి వెళ్తానని చెప్పి ఇంటి నుండి వెళ్ళాడని భార్య తెలిపిందని అన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

# పార్కుల అభివృద్ధి, నిర్వహణపై దృష్టి

కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 24:**నగర ప్రజలకు ఆహ్లాదకర మైన వాతావరణాన్ని అందించేలా పార్కుల అభివృద్ధి , నిర్వహణలో చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆల్ బ్యాంక్ కాలనీ పార్కులోని సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు కేవలం ఆహ్లాదాన్ని అందించడమే కాకుండా, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కులలో వసతులను కల్పించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆల్ బ్యాంక్ కాలనీ పార్కులో వాకింగ్ ట్రాక్, లైట్లు, ప్లాట్ ఫాం, గేట్లకు పెయింటింగ్, సూచిక బోర్డులు సహా ఇతర సదుపాయాలను మెరుగు పరచాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు పార్కులలో ఎక్కువ సమయాన్ని గడిపేలా, ప్రతి పార్కును నగరపాలక అధికారులు ఎప్పటి. కప్పుడు పర్యవేక్షిస్తూ, మరమ్మతులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సహకారంతో పార్కులను ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరమైన వాతావరణానికి కేంద్రాలుగా తీర్చిదిద్దవచ్చని తెలియ జేశారు. ఆయన వెంట ఎస్ఈ రీటా, ఈఈ మదర్సా అలీ, ఏడీహెచ్ అనిత, డీఈ లోవరాజు, సిబ్బంది ఉన్నారు

# పవన్ కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా స్థానిక ఎన్నికలపై చర్చలు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 24.**స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాన్ సూచనలకు అనుగుణంగా కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించడం జరుగుతుంది. ఈ చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. కూటమి తరఫున అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చిస్తున్నారు.
క్షేత్ర స్థాయి నుంచి సేకరించిన సమాచారాన్ని పారదర్శకంగా సమీక్షించిన మీదట జనసేన పోటీ చేసే స్థానాలు, అభ్యర్థులకు సంబంధించి శ్రీ పవన్ కళ్యాణ్ తుది నిర్ణయం తీసుకుంటారు.
జనసేన పోటీ చేసే స్థానాలు ఇవే, పోటీ చేసే అభ్యర్థులు వీరే అంటూ సాగుతున్న ప్రచారాన్ని ఎవరూ విశ్వసించవద్దు. మరికొన్ని చోట్ల అభ్యర్థుల పేరుతో తీర్మానాలు చేస్తున్న విషయం పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి చేరింది. పార్టీ విధివిధానాలు, క్రమశిక్షణను అందరూ పాటించాలి. జన సైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని, వారి ఆత్మ గౌరవాన్ని నిలిపే విధంగా జనసేన పోటీ ఉంటుందని ఇటీవలి పార్టీ శాసన సభ పక్ష సమావేశంలో వెల్లడించిన విషయాన్ని పార్టీ శ్రేణులు గుర్తించాలి అన్నారు.

## వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం....



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు 24;**అడ్డతీగల మండలం, దుప్పలపాలెం, వై. రామవరం మండలం చవిటిదిబ్బల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహణకు సోమవారం సన్నాహక సమావేశం జరిగింది. యూనియన్ పోలవరం జిల్లా అధ్యక్షురాలు పి. సత్యవతి, ఉపాధ్యక్షులు బి. దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. నూతన పోలవరం జిల్లా ఏర్పడిన నేపథ్యంలో శాఖలోని సమస్యల పరిష్కారానికి ఉద్యోగులందరూ ఐక్యంగా బలమైన సంఘంగా ఏర్పడాలని ,ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖలోని కొన్ని సమస్యలు పరిష్కరించబడినప్పటికీ, ఇంకా పరిష్కరించాల్సిన పలు సమస్యలు ఉన్నాయని, నాయకులు తెలిపారు. ముఖ్యంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, 100 శాతం గ్రాస్ జీతం అందించడం, సచివాలయ ఏ.ఎన్.ఎంలను మాతృశాఖలో పూర్తిగా విలీనం చేయడం, వివిధ కేడర్లలో పదోన్నతులను సత్వరమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా ముఖ్య సలహాదారు బి. యోహాను, సీ.హెచ్ పోసమ్మ, ఎం.పీ.హెచ్.ఈ.ఓ జి. నాగేంద్రతో పాటు పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ బలుసులమ్మ అమ్మవారి సన్నిధిలో అపూర్వ వైభవంగా 'కోటి పుష్పార్చన'





**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 24.**తాడేపల్లిగూడెం జనసేన పార్టీ కార్యాలయం నందు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా బలుసులమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరంగం ఆంజనేయులు మరియు కమిటీ సభ్యులతో వచ్చే శుక్రవారం జరిగే 'కోటి పుష్పార్చన' గోడ పత్రికలను మరియు కరపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు.
ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలు, రైతులు, ఆడపడుచులు అందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మరియు ప్రకృతి వైపరీత్యాలు సమసిపోయి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ఎండల తీవ్రత, ఎల్ నినో వంటి వాతావరణ పరిస్థితుల నుండి రక్షణ కలగాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని శ్రీ బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం ఉదయం 9:00 గంటలకు ప్రత్యేకంగా భక్తులు, దాతల సహకారంతో సుమారు 3 టన్నుల బరువుతో కూడిన కోటి పూలతో అమ్మవారికి 'కోటి పుష్పార్చన' మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల భక్తులు, ఆడపడుచులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ మహోత్సవాన్ని జయప్రదం చేసి, అమ్మవారి కృపాకటాక్షాలు పొందగలరని తెలియజేశారు. ఆలయ చైర్మన్ శ్రీరంగం అంజి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఊరేగింపుగా గొల్లగూడెం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుండి ప్రారంభమై అమ్మవారి గుడి వరకు శోభాయాత్ర సాగుతుందనీ, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కార్యాలయాల్లో ప్రతి ఉద్యోగి గౌరవానికి, భద్రతకు ప్రాధాన్యమివ్వాలి






న్యాయవాది బిస్నా చంద్రన్

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 24:**కార్యాలయాల్లో ప్రతి ఉద్యోగి గౌరవానికి, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని న్యాయవాది బిస్నా చంద్రన్ సూచించారు. ఏపీ నిట్ లోని ఉమెన్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై బోధన, బోధనేతర సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది బిస్నా చంద్రన్ మాట్లాడుతూ కార్యాలయాల్లో లైంగిక వేధింపులు మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, ఆరోగ్యకరమైన పని వాతావరణానికి విఘాతం కలిగిస్తాయని తెలిపారు. మహిళలు, ఉద్యోగులు తమకు ఎదురయ్యే వేధింపులపై మౌనం వహించకుండా చట్టపరంగా అందుబాటులో ఉన్న మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం కార్యాలయాల్లో సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం యాజమాన్యాల బాధ్యత అని తెలిపారు. వేధింపుల స్వభావం, ఫిర్యాదు చేసే విధానం, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన నిబంధనలపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. బాధితులు తమ సమస్యలను వెల్లడించేందుకు భయపడాల్సిన అవసరం లేదని, ఫిర్యాదుదారుల గోప్యతను కాపాడుతూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే వ్యవస్థలు ఉన్నాయని చెప్పారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఉద్యోగి చట్టంలోని నిబంధనలు, తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు.
కార్యాలయాల్లో పరస్పరం గౌరవించుకోవడం, వృత్తిపరమైన ప్రవర్తనను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని నిర్మించవచ్చని బిస్నా చంద్రన్ వివరించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన ఆచార్యులు డాక్టర్ ప్రత్యూష జయంతి మాట్లాడుతూ సిబ్బందిలో అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా బిస్నా చంద్రన్ బోధన, బోధనేతర సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, పలువురు అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

# ఏఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులకు బీజేపీ నేతల వినతి



**గంగవరం, పెన్ పవర్ ఆగస్టు 24:** ఏఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం గంగవరం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించారు.గంగవరం మండల బీజేపీ అధ్యక్షురాలు పుట్టపల్లి చిన్న నీలాలమ్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న నాయకులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఘటన వెనుక ఉన్న వాస్తవాలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నేరానికి పాల్పడిన వారెవరైనా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కె.వి.వి.ఎస్. రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కుంజం సత్యనారాయణమ్మ, సొసైటీ డైరెక్టర్ నరమాల శ్రీనివాస్, గంగవరం మండల ప్రధాన కార్యదర్శి జట్ల అర్జున్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ఆవల దుర్గ ప్రసాద్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సూర్యచంద్ర, గంగవరం మండల నాయకుడు జి.ఎస్. అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ, ఏకలవ్య సీట్ల సాధనపై అభినందనలు



లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో రికార్డుల పరిశీలన

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 24:** గంగవరం మండలంలోని లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను పాఠశాల కరస్పాండెంట్ మోర్తా శ్యాంసుందర్ సోమవారం సందర్శించి పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలు, గత విద్యా సంవత్సరాల్లో సాధించిన ఫలితాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గత రెండు విద్యా సంవత్సరాల్లో పాఠశాల విద్యార్థులు నవోదయ, ఏకలవ్య విద్యాలయాల్లో సీట్లు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2024--25 విద్యా సంవత్సరంలో ఒక నవోదయ, ఐదు ఏకలవ్య సీట్లు, 2025--26 విద్యా సంవత్సరంలో ఒక నవోదయ, ఏడు ఏకలవ్య సీట్లు విద్యార్థులు సాధించడం పాఠశాల ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన ప్రాథమిక అవగాహన, మార్గదర్శకత్వం కల్పించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కరస్పాండెంట్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు నవోదయ, ఏకలవ్య వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.విద్యార్థుల విజయాలకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు పువ్వల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బందిని మోర్తా శ్యాంసుందర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.

## లవ్ జిహాదీ సాధిక్ ను కఠినం గా శిక్షించాలి.. నూకరాజు కుటుంబనికి న్యాయం చేయాలి.






- పోలీసులు సకాలంలో స్పందించలేదు.
- లవ్ జిహాదీ బాధితులకు బిజెపి అండగా ఉంటుంది.
- పోలీస్ స్టేషన్లో వినతిపత్రం సమర్పణ.
- పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, నాయకులు.

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 24,** కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు కారకుడైన లవ్ జిహాదీ సాధిక్ ఖాన్ కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జనతా భారతి ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ ఎస్ఐ బి శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. బిజెపి తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బిజెపి అనుబంధ సంఘాల నాయకులు ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైఫిల్ షూటింగ్ శిక్షకుడిగా ఉన్న సాదిక్ ఖాన్ పంచాయతీరాజ్ ఏఇ నూకరాజు మనుమడుకి శిక్షణ ఇస్తూ వారి కుటుంబంతో పరిచయం పెంచుకొని వారి అల్లుడిని హత్య చేసి,కుమార్తె మానసికంగాఆస్తులను తనపేరిట రిజిస్టర్ చేయించుకొని హింసిస్తూ ఇస్లాం మతంలోకి మారాలని తీవ్ర ఒత్తిడి చేస్తూ ఆమె ప్రైవేట్ ఫోటోలను సామాజిక మధ్యమాలలో వైరల్ చేస్తానని, వారి కుటుంబం పరువు తీస్తానని బెదిరించడం తో పోలీసులను అశ్రయించారన్నారు. వారు స్పందించలేదన్నారు. సాధిక్ ఖాన్ వత్తిడి, వేధింపులు మరింత ఎక్కువ కావడంతో రాజమండ్రి గోదావరిలో దూకి ఆత్మ హత్యకు పాల్పడ్డారని, ఈతతెలిసిన పదేళ్ల మనుమడు ఒడ్డుకు వచ్చి సాధిక్ ఖాన్ వేధింపులు, తమ తండ్రిని హత్యచేసిన విషయం, వేధింపులతో తమ తల్లి తాత, అమ్మమ్మ లు గోదావరిలో దూకి ఆత్మహత్య కు పాల్పడిన విషయాలను అందరికి తెలియజేయడం తో ఈ దారుణం వెలుగులోకి వచ్చిందన్నారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు, వారి అల్లుడు హత్యకు కారకుడైనా సాధిక్ ఖాన్ ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సత్వరం కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.బిజెపి జిల్లా మీడియా కో ఇన్ ఛార్జి నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ లవ్ జిహాదీలు హిందూ మహిళల తోపాటు సమాజాన్ని వంచిస్తున్నారని, హత్యలకు, హింసకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాధిక్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబాన్ని దారుణంగా వచించాడని, వారి ఆత్మహత్యకు కారణమయ్యేడని పేర్కొన్నారు. ఇటువంటి జిహాదీలు పట్ల మహిళలు సమాజం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కిరాతకుడి కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి గట్టు మాణిక్యాల రావు మాట్లాడుతూ సాదిక్ ఖాన్ దారుణానికి ఏ ఈ నూకరాజు కుటుంబం బలి కావడం పట్ల తీవ్ర ఆందోళన చేశారు. ప్రజలంతా ఇటువంటి కిరాతకులు పట్ల లవ్ జిహాదీలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ సమాజంలో హిందూ స్త్రీలకు లవ్జిహాదీలు పెనుముప్పుగా పరిణమించారన్నారు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లవ్ జిహాదీలు హిందూ పేర్లను పెట్టుకొని హిందూ మహిళలను వంచించి మభ్యపెట్టి హత్యలకు దారుణాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఇటువంటి చర్యలు రావటం కాకుండా చూడాలని ప్రభుత్వాలు కోరారు. మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి మాట్లాడుతూ లవ్ జిహాద్ మహిళలు వంచించి హింస పూరి చేస్తున్నా డు జాగ్రత్త వహించాలని కోరారు. నూకరాజు కుటుంబానికి మరియు నూకరాజు అల్లుని హత్యకు బాధ్యుడైన లవ్ జిహాదీ సాదిక్ ఖాన్ నువ్వు కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం స్వీకరించిన పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి శ్రీనివాస్ మాట్లాడుతూ లవ్ జిహాద్ తో పాటు సంఘ వ్యతిరేక శక్తులను అరికట్టేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో అశాంతికి పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు కోట రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, పడాల కావ్య రెడ్డి, కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ, మహిళా మోర్చాజిల్లా ఉపాధ్యక్షురాలు తాడాల సూర్యకుమారి, మహిళా మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మీదుర్గ, కిసాన్ మోర్చా అధ్యక్షులు చెరుకూరి గంగాధర్, మహిళమోర్చజిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్నేటి వెంకట లక్ష్మి, ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహ మూర్తి, ముత్యాలమ్మ వారి ఆలయం ట్రస్ట్ సభ్యులు రామగాని సత్యనారాయణ, అధ్యక్షులు కంచర్ల రాజా, ప్రధాన కార్యదర్శి గోకా వర్ధన్, తుమరాడ చిన్నా, గంట వెంకట లక్ష్మి,పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి పాటే నాగేశ్వర రావు, నవీన్ కుమార్, వర్ధినీడి వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 9 అర్జీల స్వీకరణ







**భీమవరం, ఆగస్టు 24:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, నిర్ణీత గడువులోగా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం గొల్లలకోడేరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్యలకు తాత్కాలిక పరిష్కారం కాకుండా, అవి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు.

ఈ వారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి మొత్తం 9 అర్జీలు అందాయి. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి వివాదాలతో పాటు సైబర్ మోసాలు, ఆన్లైన్ మోసాలు, అధిక వడ్డీల వేధింపులు, ప్రేమ పేరుతో మోసం వంటి అంశాలపై బాధితులు ఫిర్యాదులు చేశారు. ప్రతి ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ, బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తామని భరోసా కల్పించారు.

కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె.వి.వి.ఎన్. సత్యనారాయణతో పాటు కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు యాత్రికుల సురక్షిత రవాణాపై సమీక్ష, సమావేశం





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:** రానున్న గోదావరి పుష్కరాలకు భారీ సంఖ్యలో తరలి వచ్చే యాత్రికులకు రాకపోకలలో ఎటువంటి అసౌకర్యం లేకుండా రైల్వే, ఆర్టీసీల సమన్వయంతో సమగ్రమైన రవాణా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమ క్యాంపు కార్యాలయంలో విజయవాడ రైల్వే డిఆర్ఎం మోహిత్ సోనాకియా, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డి.నరసింహ కిషోర్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనాలతో కలిసి రైల్వే, ఆర్టీసీ, ట్రాన్స్పోర్ట్, పోలీస్ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పుష్కర యాత్రికులకు చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి యాత్రికులు పెద్ద సంఖ్యలో ప్రధానంగా రైళ్ల ద్వారా రాజమహేంద్రవరం తరలి రానున్న దృష్ట్యా ప్రయాణీకుల రాక పోకలలో ఎటవంటి ఇబ్బందులు లేకుండా సజావుగా త్వరితగతిన యాత్ర పూర్తి చేసుకునేలా రైల్వే, అర్టీసి అధికారులు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్లకు చేరుకునే ప్రయాణీకుల రద్దీ నియంత్రణకు హోల్డింగ్ ఏరియాలు, సులువుగా, త్వరితగతిన ఘాట్లను చేరుకునేందుకు, యాత్ర ముగించుకుని తిరిగి వెళ్ళేందుకు ప్రత్యేక రూట్లు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ లు, వాటిని అనుసంధానం చేస్తూ అర్టీసి బస్ సర్వీసులు, నడక మార్గాలను సూచిస్తూ సవివరమైన మాప్ సిద్ధం చేయాలని కలెక్టర్ కోరారు. యాత్రిక సమూహాల నియంత్రణకు పోలీస్, రైల్వే కమ్యూనికేషన్ వ్యవస్థ మధ్య సమన్వయం ఏర్పాటు చేయాలని, అలాగే రైల్వే, పుష్కర కంట్రోల్ రూమ్ లను అనుసంధానం చేయాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ గత పుష్కరాల సందర్భంగా గమనించిన అంశాలను పరిగణలోకి తీసుకుని సవివరమైన ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేయాలని, పుష్కర యాత్రికులకు మెరుగైన సేవలు, సౌకర్యాల కల్పనకు రైల్వేల ద్వారా అవసరమైన ఏర్పాట్లు కల్పించి, పుష్కరాల నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి అన్ని విధాల సహకరిస్తామని తెలియజేసారు. ఈ సమావేశంలో రైల్వే అధికారులు షణ్ముగ వడివేలు, ప్రసాంత్ కుమార్, గౌతమ్ బాబు, ఆర్టిసి ఆర్ఎం వైఎస్ఎన్ మూర్తి, డిటిసి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## వెబ్‌ల్యాండ్ భూ రికార్డుల్లో తప్పులను సరిచేయాలి

- కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:** సోమవారం. పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో భూ రికార్డు సరిచేసిన ధృవీకరణ పత్రాల పంపిణీ, స్వచ్ఛత కార్యక్రమాలపై దిశ నిర్దేశం చేయడం జరిగింది. భూ రికార్డుల్లో గతంలో నమోదైన తప్పులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న కేసుల్లో సత్వరమే సవరణలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్, చాగల్లు మండలం, చాగల్లు గ్రామంలో వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో భూమి స్వభావానికి సంబంధించి చేపట్టిన సవరణల వివరాలను సోమవారం ఆమె వెల్లడించారు.

చాగల్లు గ్రామంలోని సర్వే నంబర్ 464-2 నుంచి 621-5 వరకు ఉన్న సర్వే నంబర్లలో 96 మంది లబ్ధిదారులకు సంబంధించిన భూముల స్వభావాన్ని సరిచేయాలని ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు. సంబంధిత రెవెన్యూ, సర్వే రికార్డులను పరిశీలించగా, గతంలో భూమి స్వభావం పొరపాటుగా నమోదైనట్లు గుర్తించినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం నిబంధనల మేరకు అవసరమైన సవరణలకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు మెట్ట భూమిగా నమోదైన భూములను పట్టా భూమిగా సవరించేందుకు కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కాకర ఆనందరావు ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తదనుగుణంగా వెబ్‌ల్యాండ్ రికార్డుల్లోనూ అవసరమైన మార్పులు చేసినట్లు చెప్పారు. ఆగస్టు 22న కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన భూ సర్వే మేళాలో ఈ దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లాలో భూ రికార్డుల్లో ఇలాంటి మార్పులు, చేర్పులు అవసరమైన సందర్భాలను గుర్తించి, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూమి హక్కులు, భూమి స్వభావం, వెబ్‌ల్యాండ్ నమోదులు తదితర అంశాల్లో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి సవరణను నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. రికార్డుల సవరణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కాకర ఆనందరావు, రాజమండ్రి ఆర్డీవో ఆర్.శివ రాముడు, చాగల్లు తహసిల్దార్ ఎమ్.మెరికమ్మ, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు, సర్వే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాల్లో 540 దరఖాస్తులు



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగస్టు 24:** 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించేందుకు ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాల్లో మొత్తం 540 దరఖాస్తులు స్వీకరించినట్లు ఉంగుటూరు ఎలక్షన్ డీటీ సంధ్యారాణి తెలిపారు.

ఉంగుటూరు మండలంలో 232, భీమడోలులో 64, నిడమర్రులో 108, గణపవరంలో 136 దరఖాస్తులను బూత్ లెవెల్ అధికారులు స్వీకరించారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీ, సవరణలకు సంబంధించి 157 క్లెయిమ్‌లు వచ్చినట్లు వెల్లడించారు.

మరోసారి ఈ నెల 29, 30 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు సంధ్యారాణి తెలిపారు. అర్హులైన యువత, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి అంగన్‌వాడీలే కీలకం



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగస్టు 24:** పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమని ఐసీడీఎస్ భీమడోలు ప్రాజెక్టు అధికారి సునీల్ రాజ్‌శేఖర్ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మరింత అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

సోమవారం ఉంగుటూరులో నిర్వహించిన రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ఫౌండేషన్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, శారదామణి, రిసోర్స్ పర్సన్లు ప్రేమ్‌కుమార్, కూన కమల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com